


పాత్రునివలసలో నిర్మించిన టిడ్కో ఇళ్లు..



- టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు చుక్కలు చూపించిన జగన్
- డీడీలు కూడా వెనక్కి ఇవ్వని వైనం
- టీడీపీ హయాంలో నిర్మించిన ఇళ్లకు వైసీపీ రంగులు
- ప్రభుత్వ తీరుపై లబ్ధిదారుల మండిపాటు

ఐదేళ్లు సరిపోలే!

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

వైసీపీ పాలనలో టిడ్కో ఇళ్ల పంపిణీ కలగానే మిగిలింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో టిడ్కో ఇళ్లు నిర్మించారు. ఇంతలో 2019లో సార్వత్రిక లఎన్నికలు రాగా.. కోడ్ నేపథ్యంలో లబ్ధిదారులకు పంపిణీ నిలిచిపోయింది. తర్వాత వైసీపీ అధికారంలోకి రాగా... రకరకాల సాకులతో ఈ ఐదేళ్ల లబ్ధిదారులకు ఇళ్లను పంపిణీ చేయకుండా జాప్యం చేసింది. ఇళ్లకు వైసీపీ జెండాను పోలిన రంగులు వేసి వదిలేసింది. కొంతమందికి ఇళ్లు అప్పగించినట్టు చెబుతున్నా.. పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు కేటాయించ లేదు. దీంతో చాలామంది లబ్ధిదారులు టిడ్కో ఇళ్ల కోసం ఎదురుచూస్తున్నారు. మరికొందరు గతంలో టిడ్కో ఇళ్ల కోసం డీడీలు చెల్లించినా.. మంజూరు కాలేదు. డీడీల నగదు కూడా వెనక్కి రాలేదు. అటువంటి వారంతా తాము చెల్లించిన డీడీల మొత్తాన్ని అయినా తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. అప్పు చేసి డీడీల డబ్బులు చెల్లించామని.. వడ్డీలు చెల్లించలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. తమ సొంతింటి కలను నెరవేర్చని.. వైసీపీకి ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం తప్పదని స్పష్టం చేస్తున్నారు.



ఆమదాలవలసలో ప్రారంభించినా.. లబ్ధిదారులకు అప్పగించని టిడ్కో ఇళ్లు

● ఇదీ పరిస్థితి..

పట్టణ ప్రజలకు సొంతిల్లు ఉండాలనే ఆకాంక్షతో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు టిడ్కో ఇళ్లను లబ్ధిదారుల భాగస్వామ్యంతో నిర్మించారు. జిల్లాలో శ్రీకాకుళం నగర ప్రజల కోసం పాత్రునివలస-1లో 1,280 ఇళ్లు నిర్మించారు. వీటిని మాత్రమే పది నెలల కిందట లబ్ధిదారులకు అందజేశారు. పాత్రునివలస-2లో 624 ఇళ్లకుగానూ.. నిర్మాణ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. కానీ కొంతమంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేసి ఇటీవల పట్టాలు అందించారు. ఇళ్లను అప్పగించలేదు.

- ఆమదాలవలసలో 528 ఇళ్లను నిర్మించారు. ఎన్నికల కోడ్ ముందు స్పీకర్ తమ్మినేని సీతారాం ఈ ఇళ్ల ప్రారంభోత్సవానికి శంకుస్థాపన చేశారు. కానీ ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించలేదు. ఇళ్ల కోసం చాలామంది డీడీలు సమర్పించినా.. మంజూరు జాబితాలో కొన్నిపేర్లు తారుమారు అయ్యాయని పలువురు గగ్గోలు పెడుతున్నారు. శ్రీకాకుళంలో పాత్రునివలస వద్ద కూడా ఇదే పరిస్థితి చోటుచేసుకుంది.
- ఇచ్ఛాపురంలో 192 ఇళ్ల నిర్మాణం ఇంకా జరుగుతోంది. ఇళ్లను లబ్ధిదారులకు అప్పగిద్దామన్న ఆలోచన అధికార పార్టీ నాయకుల్లో ఇసుమంతైనా లేదు. అధికారులు కూడా శ్రద్ధ చూపలేదు. దీంతో టిడ్కో ఇళ్ల కోసం ఎదురుచూస్తున్న వారంతా వైసీపీ ప్రభుత్వ తీరుపై గుర్రుగా ఉన్నారు. టీడీపీకి గుర్తింపు వచ్చేస్తుందన్న కారణంతోనే ఇళ్లను అప్పగించలేదని ఆరోపిస్తున్నారు. రాజకీయాలతో ఇబ్బంది పాల్జేసిన వైసీపీకి ఈ ఎన్నికల్లో ఓట్ల రూపంలో బుద్ధి చెబుతామని స్పష్టం చేస్తున్నారు. మళ్లీ కూటమి అధికారంలోకి వచ్చి.. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే తమకు టిడ్కో ఇళ్లు దక్కుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

లబ్ధిదారులకు బ్యాంకుల తాఖీదులు

● ఇళ్లు లేకుండానే వడ్డీ, అసలు కట్టాలని ఒత్తిడి



- ఈమె పేరు **జోగ బుడ్డెమ్మ**. పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ సూదికొండకాలనీకి చెందిన ఈమె గత టీడీపీ ప్రభుత్వ హయాంలో టిడ్కో ఇల్లు కోసం రూ.50 వేలు డీడీ చెల్లించింది. తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం రివర్స్ టెండర్ల పేరుతో మొత్తం గృహనిర్మాణాన్ని నిలుపుదల చేసింది. రెండేళ్ల కిందట నిర్మాణంలో ఉన్న మేరకు గృహాలు ఇస్తామని చెప్పి.. వాటికి బ్యాంకు రుణాల పేరుతో లబ్ధిదారుల నుంచే డబ్బులు కట్టించుకుంది. తీరా నిర్మాణం పూర్తి కాక లబ్ధిదారులకు గృహాలు కేటాయించలేదు. కాగా.. రుణాలకు సంబంధించి అసలు, వడ్డీ చెల్లించాలని బ్యాంకు నుంచి తాఖీదులు అందడంతో.. ఆమె ఆవేదన చెందుతోంది.

(పలాస)

పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో బొడ్డపాడు వద్ద టీడీపీ హయాంలో 1,950 టిడ్కో ఇళ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టారు. గత ఎన్నికల సమయానికి 950 గృహాలు పూర్తయ్యాయి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రివర్స్ టెండర్లు పేరిట పెండింగ్ ఉన్న ఇళ్ల నిర్మాణాలను రద్దు చేసింది. నిర్మాణాలు పూర్తయిన వాటిని పంపిణీ చేస్తామని ప్రకటించింది. దీంతో లబ్ధిదారులు సంబరపడ్డారు. తీరా.. ఈ ఐదేళ్లలో లబ్ధిదారుల నుంచి మొత్తం గృహానికి అయ్యే ఖర్చు సబ్సిడీ మినహా బ్యాంకుల్లో డబ్బులు కట్టించుకున్నారు. రుణాలు తీసుకొని కట్టిన గృహాలకు రిజిస్ట్రేషన్లు చేయించారు.

దీంతో తాము గృహప్రవేశం చేయవచ్చని లబ్ధిదారులంతా ఊహించారు. అక్కడ నుంచి వారికి కష్టాలు ప్రారంభం అయ్యాయి. టిడ్కో గృహాలు కేవలం స్ట్రక్చర్ మాత్రమే పూర్తిచేసి లోపల భాగాల పనులు చేపట్టలేదు. విద్యుత్, మరుగుదొడ్లు, రహదారులు, పెయింటింగ్, తలుపులు, తాగునీరు సదుపాయాలు కల్పించాల్సి ఉంది. మరోవైపు రుణాలు చెల్లించాలంటూ బ్యాంకుల నుంచి లబ్ధిదారులకు ఒత్తిళ్లు పెరుగుతున్నాయి. ఒక్కో లబ్ధిదారుడికి రూ.35వేలు చెల్లించాలని నోటీసులు వస్తుండడంతో వారంతా తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు కేటాయించని గృహాలకు తాము ఎందుకు వడ్డీలతో సహా అసలు కట్టాలని వారు ప్రశ్నిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం తప్పిదాల వల్ల తాము ఇబ్బందులు పడుతున్నామన్న ఆందోళన చెందుతున్నారు.

వారి పరిస్థితి మరీ దయనీయం

టిడ్కో గృహాలకు కొంతమంది డీడీల రూపంలో డబ్బులు చెల్లించారు. కాగా.. ఇళ్ల కేటాయింపులు జరగని వారికి సెంటు చొప్పున స్థలంతో పాటు కట్టిన నగదు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. నగదుపై ఇంతరకూ ఎటువంటి హామీ లేకపోగా స్థలాల కోసం పట్టాలు మంజూరు చేశారు. ఇప్పటి వరకూ ఒక్క లబ్ధిదారుడికి కూడా స్థలాన్ని చూపించకపోవడంతో వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టిడ్కో గృహాల జాబితాలో వారి పేర్లు ఉండడంతో జగనన్న కాలనీకి వారు అర్హత పొందలేకపోయారు. ప్రస్తుతం వారి పరిస్థితి రెంటికి చెడ్డ రేవడిలా మారింది.



పలాస : టిడ్కో కాలనీలో ప్రారంభం కాని రహదారుల నిర్మాణం..

ఎన్నికల నిర్వహణకు సర్వసన్నద్ధం

● కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

కలెక్టరేట్, మే 7: ఎన్నికల నిర్వహణకు సర్వసన్నద్ధం కావాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 13న పకడ్బందీగా పోలింగ్ నిర్వహించాలని సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం రాత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆర్వోలు, ఈఆర్వో, ఏఈఆర్వోలు, ఎన్నికల సిబ్బందితో పలు అంశాలపై సమీక్షించి మాట్లాడారు. 'నోడల్ అధికారులు సమన్వయంతో పనిచేయాలి. పోలింగ్ కేంద్రాల వద్ద వసతులు కల్పించాలి. బీఎల్వోల ద్వారా ఓటరు స్లిప్పుల పంపిణీ చేపట్టాలి. వెబ్‌కాస్టింగ్ ద్వారా ఎన్నికల సరళిని నిరంతరం పరిశీలిస్తాం. డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, పోలింగ్ కేంద్రాల నిర్వహణకు ప్రణాళికా బద్ధంగా ఏర్పాట్లు చేయాలి. పోలింగ్ పూర్తయ్యాక చట్టబద్ధమైన పత్రాలు స్వీకరణలో అప్రమత్తంగా ఉండాలి. ఈవీఎంల స్ట్రాంగ్‌రూమ్ భద్రతా ఏర్పాట్లు, సీళ్లు క్షుణ్ణంగా పరిశీలించాలి' అని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ నవీన్, అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డీఆర్వో ఎం.గణపతిరావు, ఆర్వోలు నూరుల్‌కమర్, భరత్‌నాయక్, సీహెచ్ రంగయ్య, లక్ష్మణమూర్తి, రామ్మోహన్, సుదర్శన్‌దొర, అప్పారావు, జడ్పీ సీఈవో వేంకటేశ్వరరావు, ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ, జీఎస్టీ ఏసి రాణీమోహన్, సీపీవో ప్రసన్నలక్ష్మి, డీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి, సమాచార పౌరసంబంధాల అధికారి కె.చెన్నకేశవరావు పాల్గొన్నారు.

రోడ్డుపై తల్వార్‌తో కేక్ కటింగ్

- ఎన్నికల నిబంధనలు ఉల్లంఘన
- సోషల్ మీడియాలో వీడియో హల్‌చల్

శ్రీకాకుళం క్రైం, మే 7: శ్రీకాకుళంలో పేకాటరాయుళ్లు, బెట్టింగ్ బాబులు, రౌడీషీటర్లు ఎన్నికల నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. శ్రీకాకుళం వన్‌టౌన్ పరిధిలోని గోల్కొండరేవు బండారి సందులో ఇద్దరు వ్యక్తుల ఆధ్వర్యంలో వారి స్నేహితుడి పుట్టినరోజు వేడుకలు ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించారు. ఆదివారం అర్ధరాత్రి తర్వాత నడిరోడ్డుపై తల్వార్‌తో పుట్టినరోజు కేకును కట్ చేయించారు. ఇది సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ కావడంతో కలకలం రేపుతోంది. రౌడీషీటర్లు ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించినా.. పోలీసులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై స్పెషల్ బ్రాంచ్ పోలీసులు ఆరా తీస్తున్నారు.

సీఎం పర్యటనతో.. ప్రజలకు ఇక్కట్లు

- ఇచ్ఛాపురంలో జగన్ రోడ్‌షో
- సభకు ఆటోల్లో జనాల తరలింపు
- ట్రాఫిక్ ఆంక్షలతో అవస్థలు



ప్రసంగిస్తున్న సీఎం జగన్మోహన్‌రెడ్డి

ఇచ్ఛాపురం, మే 7: సీఎం జగన్ వస్తున్నారంటే చాలు.. ప్రజలకు ఇబ్బందులు సర్వసాధారణమైపోయాయి. జనసమీకరణలో భాగంగా ఆర్టీసీ బస్సులు సైతం సీఎం సభకు కేటాయించడం.. ఎక్కడికక్కడ ట్రాఫిక్ ఆంక్షలు విధించడం.. షరామామూలుగా మారింది. ఇచ్ఛాపురంలో మంగళవారం నిర్వహించిన సీఎం రోడ్‌షో నేపథ్యంలో ఇవే పరిస్థితులు ఎదురయ్యాయి. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం జగన్ మంగళవారం ఇచ్ఛాపురంలో రోడ్‌షో నిర్వహించారు. మున్సిపల్ ఆఫీస్ జంక్షన్ వద్ద రెండు బస్సులతో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం 3.30 గంటల నుంచి 4.10 గంటల వరకు సీఎం ప్రసంగించారు. కాగా.. మధ్యాహ్నం ఒంటిగంట నుంచే జనంతో రోడ్లను కిక్కిరిసేలా చేశారు. వాహనాల రాకపోకలు కొన్ని గంటలపాటు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

- సీఎం రోడ్‌షోకు ఇన్‌చార్జిలు ఒక్కో వార్డు, పంచాయతీ నుంచి తప్పకుండా 500 మందికి తగ్గకుండా తీసుకురావాలని వైసీపీ పెద్దలు ఆదేశించారు. ఈ మేరకు జనాలను తరలించేందుకు వైసీపీ నాయకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆటోలు ఏర్పాటు చేసి.. ఒక్కొక్కరికీ రూ.200 చొప్పున చెల్లించి.. సీఎం రోడ్‌షోకు తరలించారు.
- సీఎం రోడ్‌షో ప్రారంభం కాకముందే.. ఉదయం 10గంటల నుంచే ఆర్టీసీ బస్సులను కాంప్లెక్స్‌లో నిలిపేశారు. సోంపేట, ఒడిశా నుంచి వచ్చిన బస్సులు కూడా టౌన్ లోకి రాకుండా అడ్డుకున్నారు. సోంపేట నుంచి వచ్చే బస్సులను హైవే మీదుగా తరలించడంతో.. ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. పురుషోత్తపురం చెక్‌పోస్టు వద్ద దిగి కాలినడకన ఇళ్లకు చేరుకున్నారు.



తొలగించిన డివైడర్

- ఇచ్ఛాపురం మునిసిపల్ కార్యాలయం జంక్షన్ వద్ద సీఎం బస్సు ఏర్పాటుకు.. రోడ్డుపై డివైడర్‌ను తొలగించారు.
- షెడ్యూల్ కన్నా సీఎం రోడ్‌షో గంటన్నర ఆలస్యంగా ఆరంభమైంది. టీడీపీ అధినేత చంద్రబాబుపై విమర్శలు తప్ప.. సీఎం ప్రసంగంలో కొత్తదనం లేకపోవడంతో చాలామంది ప్రజలు జగన్ మాట్లాడుతుండగానే.. వెనుదిరిగారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ, ఎంపీ అభ్యర్థి పేడాడ తిలక్, ఎమ్మెల్సీ నర్తు రామారావు, వైవీ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం కాంప్లెక్స్‌లో నిలిచిన బస్సులు



శ్రీకాకుళంలో కురుస్తున్న వర్షం



జమ్ము(నరసన్నపేట), ఎల్.ఎల్.పురం(పోలాకి)లో నేలరాలిన మామిడిని చూసి రైతుల ఆవేదన





మలగాంలో ధాన్యంపై కప్పిన టార్పాన్లు

అకాల వర్షం.. దెబ్బతిన్న పంటలు

(శ్రీకాకుళం-ఆంధ్రజ్యోతి/ నరసన్నపేట/ గార/ టెక్కలి/ పోలాకి/ జలుమూరు)

అల్పపీడనం ప్రభావంతో జిల్లాలో కురుస్తున్న అకాల వర్షాలతో రైతులకు నష్టం వాటిల్లుతోంది. సోమవారం సాయంత్రం పలు ప్రాంతాల్లో వర్షం కురవగా వాతావరణం చల్లబడింది. మంగళవారం ఉదయం కూడా శ్రీకాకుళం, నరసన్నపేట, టెక్కలి, గార.. తదితర ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. మరోవైపు ఈదురుగాలుల ప్రభావంతో అరటి, మామిడి, జీడిమామిడి పంటలు దెబ్బతిన్నాయి. నరసన్నపేట మండలంలో జమ్ము, రావాడపేట, దశుమంతుపురం, గడ్డెయ్యపేట, కిల్లాం, మాకివలస, ఉర్లాం, నడగాం గ్రామాల్లోని తోటల్లో మామిడికాయలు నేలరాలడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కోమర్తి, మాకివలస గ్రామాల్లో అరటి దెబ్బతింది. నరసన్నపేట జూనియర్ కళాశాల మైదానంలో వరదనీరు చేరడంతో పోస్టల్ బ్యాలెట్‌కు వెళ్లిన ఓటర్లు ఇబ్బందులు పడ్డారు. గార మండలం శాలిహుండంలో మొక్కజొన్న గింజలు, ధాన్యంపై రైతులు టార్పాన్లు కప్పారు. టెక్కలి నియోజకవర్గంలో నర్సింగపల్లి, మొఖలింగాపురం, గూడేం, లింగాలవలస, మేఘవరం, పోలవరం, పెద్దసాన గ్రామాల్లో మామిడి రైతులకు అపారనష్టం జరిగింది. టెక్కలి మేజర్ పంచాయతీలో మురుగునీరు రోడ్లపై ప్రవహించింది. నౌపడా-మెళియాపుట్టి రోడ్డు జంక్షన్‌లో వర్షపునీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

పోలాకి మండలంలో సంతలక్ష్మీపురం, దీర్ఘాశి, తోటాడ, డోల, గొల్లలవలస, చల్లబంద, కుసుమపోలవలస, రాళ్లపాడు, ఈదులవలసలో మామిడి కాయలు నేలరాలడంతో లీజుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జలుమూరు మండలంలో శ్రీముఖలింగం, నగిరికటకం, మెట్టపేట, మర్రివలస, మాకివలస, శ్రీమన్నారాయణపురం, అచ్యుతాపురం, కొమనాపల్లి, కత్తిరివానిపేట, తిమడాం, అల్లాడ, పర్లాం, తదితర గ్రామాల్లో మామిడి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. అలాగే శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

నాయకుడికో రేటు



- వైసీపీ అసంతృప్తులకు క్యాష్ బ్యాగులు
- స్థాయిని బట్టి రేటు ఫిక్స్ చేస్తున్న వైనం
- నగదు ముట్టజెప్పుతున్న కీలక ప్రజాప్రతినిధి
- దగాకు గురైన నిజమైన కార్యకర్తలు

(రణస్థలం)

మండల స్థాయి నాయకుడికి ఒక రేటు. సర్పంచ్, ఎంపీటీసీ సభ్యుడికి మరో రేటు. గ్రామస్థాయి చోటా మోటా నేతలకు ఇంకోరేటు.. ఇలా ఎచ్చెర్ల నియోజకవర్గంలో కోట్ల రూపాయలను ముట్టజెప్పినట్టు సమాచారం. వైసీపీ అధికారంలోకి వచ్చిన మూడేళ్లకే ఎచ్చెర్లలో విభేదాలు బయటపడ్డాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో సీనియర్లను కాదని.. డబ్బులు ముట్టజెప్పిన వారికే పదవులు ఇచ్చారని చాలామంది అసంతృప్తిని వెళ్లగక్కారు. అవి రోజురోజుకు నివురుగప్పిన నిప్పుల మారి తీవ్ర విభేదాలకు దారితీశాయి. 'జగనన్న ముద్దు సిట్టింగ్ ఎమ్మెల్యే వద్దు' అన్నంత రేంజ్‌కు పరిస్థితి వచ్చింది. నియోజకవర్గంలోని రణస్థలం, జి.సిగడాం, లావేరు, ఎచ్చెర్లలో అసంతృప్తి నేతలు వరుసగా సమావేశాలు అయ్యారు. వందలాది మందిని పోగుచేసుకొని కీలక ప్రజాప్రతినిధికి వ్యతిరేకంగా సభలు ఏర్పాటుచేశారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కీలక నేతలతో బలప్రదర్శనకు కూడా దిగారు. విజయనగరం ఎంపీతో పాటు ఆ జిల్లాకు చెందిన కీలక నేతలు పోటీచేయాలని కూడా తీర్మానాలు పంపారు. కానీ సదరు కీలక ప్రజాప్రతినిధి మాత్రం డోంట్ కేర్ అన్నట్టు ఉండిపోయారు.

ఆ కండీషన్‌తోనే..

కీలక ప్రజాప్రతినిధి అధిష్టానాన్ని ఏవిధంగా దారికి తెచ్చుకోవాలో ఆ విధంగా తెచ్చుకున్నారు. అప్పుడే హైకమాండ్ ఒక షరతుపెట్టింది. అసంతృప్తులను దారికి తెచ్చుకుంటేనే టిక్కెట్ అని కండీషన్ పెట్టింది. ఇంకేముంది ప్యాకేజీ స్టార్లకు దశ తిరిగిపోయింది. చావు అంచుల దాకా వెళ్లిన ఎచ్చెర్ల మండల స్థాయి నాయకుడు రూ.25 లక్షలకు ఒప్పేసుకున్నాడు. తన కోసం జిల్లా కేంద్రంలో పాదయాత్ర చేసిన ప్రజలకు గుర్తుకు రాలేదు. నాడు ప్రజలను అడ్డంపెట్టుకొని తాను చేసిన రాజకీయం గుర్తుకురాలేదు. క్యాష్ బ్యాగు అందుకొని అదంతా పీడకలగా మరిచిపోయారు. కొద్దిరోజులుగా కీలక ప్రజాప్రతినిధిపై అసమ్మతిని ప్రదర్శించిన ఎచ్చెర్ల మహిళా నేత ఒకరు ఏకంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు పోస్టల్ బ్యాలెట్ శిబిరం వద్దకు వెళ్లి ప్రచారం చేశారట. కీలక ప్రజాప్రతినిధికి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారట. ఏంటమ్మా నిన్న మొన్నటివరకూ వ్యతిరేకించి ఇప్పుడు ఓటు వేయాలని కోరడం ఏంటమ్మా? రూ.20 లక్షలు బాగానే వర్కవుట్ అయ్యాయయని స్థానిక యువకులు నిలదీసినంత పనిచేయడంతో ఆమె అక్కడ నుంచి పలాయనం చిత్తగించారు.

బాధిత వర్గాలు ఎన్నో..

అసంతృప్తుల జాబితాలో ఉన్న సర్పంచ్‌కు రూ.లక్ష, ఎంపీటీసీ సభ్యుడికి రూ.50 వేలు పంచినట్టు ప్రచారం జరుగుతోంది. ఎచ్చెర్లలో కీలక ప్రజాప్రతినిధికి వ్యతిరేకంగా జరిగిన సభలు, సమావేశాల్లో బల ప్రదర్శనకు దిగారు. అందులో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు కీలకంగా వ్యవహరించారు. అయితే కీలక నేతలకు లక్షల రూపాయలు ఇచ్చి సర్దుబాటు చేయడంతో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు గోల చేశారు. దీంతో వీరికి సైతం తలో మొత్తం ఇచ్చి చేతులు కట్టేశారు. అయితే ఈ మొత్తం వ్యవహారంలో నష్టపోయింది మాత్రం సామాన్య కార్యకర్తలు, నేతల అనుచరులే. ఇప్పటికీ చాలా గ్రామాల్లో సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, వెల్‌నెస్ కేంద్రాల నిర్మాణం చేపట్టిన సామాన్య కార్యకర్తలు, నేతలకు బిల్లులు చెల్లించలేదు. గడపగడపకూ మన ప్రభుత్వం నిధులతో పనులు చేపట్టిన వారికి చిల్లిగవ్వ ఇవ్వలేదు. లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టిన వారికి బిల్లులు చెల్లించలేదు. ఒక వేళ ప్రభుత్వం మారితే వారి బిల్లుల పరిస్థితి ఏమిటన్నది తెలియడం లేదు. మరోవైపు వలంటీర్లతో రాజీనామా చేయించారు. కొందరికి ఇష్టం లేకున్నా బలవంతంగా చేయించారు. అయితే ప్యాకేజీ నాయకులకు భారీస్థాయిలో ముట్టజెప్పగా.. పార్టీ నమ్ముకున్న నిజాయితీ కార్యకర్తకు మాత్రం ఒరిగిందేమీ లేకుండాపోయింది. అందుకే వారిలో అంతర్మథనం ప్రారంభమైంది. ఇది ఎన్నికల్లో తప్పకుండా ప్రభావం చూపుతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

- కొద్ది నెలల కిందట ఓ నాయకుడిపై దాడి జరిగింది. దాదాపు చావు అంచుల దాకా వెళ్లి వచ్చారు ఆయన. సొంత పార్టీలో మరో నేతతో తలెత్తిన రాజకీయ విభేదాలే ఈ ఘటనకు కారణం. అప్పట్లో జిల్లాలో పెను సంచలనంగా మారింది. అయితే దీని వెనుక 'కీలక ప్రజాప్రతినిధి ఉన్నట్టు ప్రచారం జరిగింది. ఆయన ఆస్పత్రికి పరామర్శకు వచ్చినా సదరు బాధిత నేత అనుచరులు, కుటుంబసభ్యులు, గ్రామస్థులు కీలక ప్రజాప్రతినిధిని అడ్డగించారు. ఆ నేతకు న్యాయం చేయాలని జిల్లా కేంద్రంలో వేలాది మందితో ర్యాలీ తీశారు. సీన్ కట్‌చేస్తే సదరు నాయకుడు ఇప్పుడు అదే ప్రజాప్రతినిధి పోటీచేస్తుండడంతో మద్దతు తెలిపి ప్రచారం చేస్తున్నారు. దీని వెనుక రూ.25 లక్షల ప్యాకేజీ కుదిరినట్టు వారి అనుచరులే చెబుతున్నారు.

- ఎచ్చెర్ల మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఆ కుటుంబం గతంలో మండల పదవులు చేపట్టింది. గత ఐదేళ్ల కాలంలో మండలస్థాయి పదవితో పాటు ఓ కార్పొరేషన్ ఛైర్మన్ పదవి సైతం వారికి వరించింది. కానీ ఎచ్చెర్ల కీలక ప్రజాప్రతినిధితో వీరికి పొసిగేది కాదు. వ్యతిరేక వర్గంగా ముద్రపడ్డారు. అసలు ఆయనకు టిక్కెట్ ఇస్తే తాము సహకరించమని తేల్చేశారు. కీలక ప్రజాప్రతినిధితో విభేదాలతో ఈ నేతను నమ్ముకున్న గ్రామస్థులు, కార్యకర్తలు నష్టపోయారు.. ఇప్పుడు సీన్ కట్‌చేస్తే గతంలో కీలక ప్రజాప్రతినిధితో విభేదించిన వీరే ప్రస్తుతం ఆయనకు మద్దతుగా ప్రచారం చేస్తున్నారు. అయితే దీని వెనుక ఎంత ప్యాకేజీ పనిచేసిందో తెలుసా.. అక్షరాలా రూ.20 లక్షలని ఆ పార్టీలోనే ప్రచారం సాగింది. సొంత వారి నుంచే వీరికి నిలదీతలు కూడా ఎదురయ్యాయి.

- రణస్థలం మండలానికి చెందిన ఓ నాయకుడు పార్టీ ఆవిర్భావం నుంచి మండల పార్టీ కన్వీనర్‌గా ఉండేవాడు. ఆయనది నియోజకవర్గంలో బలమైన సామాజికవర్గం. 2014లో పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత సదరు నేతను పార్టీ పదవి నుంచి తప్పించారు. పూర్తిగా ప్రాధాన్యత తగ్గించేశారు. ఆయన గత ఐదు సంవత్సరాలుగా ఎక్కడున్నారో పట్టించుకునే వారు లేకపోయారు. పార్టీ కోసం ఇంత పనిచేస్తే.. తనను కనీస పరిగణలోకి తీసుకోకపోవడంపై ఆయన ఆవేదనతో గడిపారు. ఎలాగైనా కీలక ప్రజాప్రతినిధికి బుద్ధి చెప్పాలని భావించి ఎమ్మెల్యే స్థానానికి ఇండిపెండెంట్‌గా నామినేషన్ దాఖలు చేశారు. ప్రచారం కూడా మొదలుపెట్టారు. కానీ ఉన్నట్టుండి ఆయన కీలక ప్రజాప్రతినిధి చెంతకు చేరారు. సీన్ కట్‌చేస్తే రూ.10 లక్షల ప్యాకేజీతో యూటర్న్ తీసుకున్నట్టు ప్రచారం జరుగుతోంది.

- లావేరు మండలానికి చెందిన ఓ సీనియర్ నాయకుడు కీలక ప్రజాప్రతినిధిని వ్యతిరేకించారు. గత ఐదేళ్లలో ఈ బాధిత నేత అణచివేతకు గురయ్యారు. అందుకే తనకు ఈసారి చాన్స్ ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థిత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. కానీ అంగబలం, అర్థబలంతో కీలక ప్రజాప్రతినిధి మూడోసారి పార్టీ టిక్కెట్ సొంతం చేసుకున్నారు. ఈ క్రమంలో అసంతృప్తి నాయకుడికి పిలిపించి మాట్లాడారు. రూ.20 లక్షలకు ప్యాకేజీ కుదిర్చారు. ఈ దారుణ వంచనను సహించలేకపోయిన సదరు నేత నేరుగా కూటమి అభ్యర్థి వద్దకు వచ్చి మద్దతు తెలిపారు. దీంతో ఎచ్చెర్లలో 'ప్యాకేజీ' సర్దుబాట్లు బయటకు వచ్చాయి.

ఓలప్ప ఓటుకు బయలుదేరినావా?

(టెక్కలి)

ఈసారి ఓటేస్తే ఆ పార్టీ, ఈ పార్టీవోలు ఎక్కువ డబ్బులిస్తారట. రెండు రోజులు సెలవుపెట్టి బేగి ఇంటికిరాయండి. ఓటువేసి మళ్లీ ఎల్లిపోదురంటూ పట్టణాల్లో పనికి వెళ్లిన వారికి గ్రామాల్లో ఉన్న కుటుంబసభ్యులు, బంధువులు కవురెట్టుతున్నారు. ఓలప్ప.. గాదప్పకు చెప్పు బయలు దేరండని.. మా నేస్తంకు చెప్పు బేగిరావాలని.. వరిపండుకు చెప్పు ఓట్లు



వేసిన రోజుకి ముందేరావాలని ఇలా ఎవరికి వాళ్లు పట్టణాల్లో ఉపాధి కోసం వెళ్లిన వలస ఓటర్లకు ఫోన్లు చేసుకుంటున్నారు. బస్సులు ఖాళీలేవు, రైలు బల్లు ఖాళీలేవు అని మా పక్కింటోల్లు అనుకుంటున్నారు. కనీసం కూకోడానికి సీటుదొరికినా చాలు బయలుదేరుతాం. బేగి రా అంటే ఎలగొస్తామంటున్నారు వలస ఓటర్లు.

రాజకీయాల్లో చెరగని ముద్ర మజ్జి

- సర్పంచ్ స్థాయి నుంచి మంత్రిగా ఎదిగిన తులసీదాస్
- పీసీసీ చీఫ్‌గా, రాజ్యసభ సభ్యుడిగా ఎంపిక
- పీవీ నరసింహారావు ప్రధాన అనుచరుడిగా పేరు
- ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేస్తున్న తులసీదాస్ కుమారుడు

(హరిపురం)



మజ్జి తులసీదాస్



మజ్జి శారద



మజ్జి త్రినాథ్‌బాబు

జిల్లా రాజకీయాల్లో మజ్జి కుటుంబానిది చెరగని ముద్ర. ఓ మారుమూల గ్రామంలో జన్మించిన మజ్జి తులసీదాస్ సర్పంచ్ స్థాయి నుంచి మంత్రిగా ఎదిగారు. అలాగే, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా (పీసీసీ) పని చేశారు. రాజ్యసభకు ఎంపికై పెద్ద సభలో అడుగుపెట్టే అవకాశం లభించింది. సొంపేట మండలం మామిడిపల్లి పంచాయతీ పాత్రపురంలో జన్మించిన తులసీదాస్ మందసలో స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నారు. మందస ఉన్నతపాఠశాలలో చదువుతున్న సమయంలో 1942లో జరిగిన క్విట్‌ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. 1959లో మామిడిపల్లి సర్పంచ్‌గా, 1959 నుంచి 1964 వరకు మందస సమితి అధ్యక్షుడిగా కూడా ఎన్నికయ్యారు. 1968లో మందస మండలం వీజీపురం సర్పంచ్‌గా ఎన్నికై 1972 వరకు రెండోసారి సమితి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. 1962లో స్వతంత్ర అభ్యర్థిగా సోంపేట నుంచి ఎమ్మెల్యేగా పోటీచేసి ఓడిపోయారు. 1963లో కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ ఆర్గనైజర్‌గా, కార్యదర్శిగా, పీసీసీ సభ్యుడిగా పదవులు చేపట్టారు. 1967లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి గౌతు లచ్చన్న చేతిలో ఓటమిపాలయ్యారు. మూడోసారి 1972లో కాంగ్రెస్ తరపున పోటీచేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. పీవీ నరసింహారావు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆయనకు ప్రధాన అనుచరుడిగా మారారు. 1978లో ఎమ్మెల్యేగా పోటీచేసి ఓడిపోయారు. దీంతో 1980లో పార్టీ అధిష్ఠానం ఎమ్మెల్సీగా అవకాశం కల్పించి పెద్దల సభకు పంపించింది. 1980 నుంచి 1984వరకు పీవీ మంత్రి వర్గంలో వెనుకబడిన తరగతులు, మధ్యతరహా నీటిపారుదల శాఖ, పరిశ్రమల శాఖమంత్రిగా పనిచేశారు. ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీలకు అనుచరుడిగా ఆంధ్రలో ఇందిరా కాంగ్రెస్ వ్యవస్థాపనలో ప్రధానపాత్ర పోషించారు. జిల్లాలో ఇందిరా కాంగ్రెస్ రథసారధిగా బాధ్యతలు నిర్వహించారు. పీవీ నరసింహారావు ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆయన సూచనతో 1992లో పీసీసీ అధ్యక్షుడిగా నియమితులై 1994 వరకు రెండేళ్ల పాటు బాధ్యతలు నిర్వహించారు. 1994 ఏప్రిల్ 4న రాష్ట్రం నుంచి రాజ్యసభకు ఎన్నిక కాగా, ఆ పదవిలో ఉండగానే 1994 సెప్టెంబరు 20న మృతిచెందారు. అనంతరం ఆయన వారసురాలిగా కుమార్తె మజ్జి శారద గ్రూప్-1 ఉద్యోగాన్ని వదిలి కాంగ్రెస్ తరపున ఎమ్మెల్యేగా పోటీచేశారు. అనంతరం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. తర్వాత ఆమె సోదరుడు మజ్జి త్రినాథ్‌బాబు ఆర్టీసీలో ఉన్నత ఉద్యోగాన్ని విడిచిపెట్టి ప్రస్తుతం ఎమ్మెల్యేగా పలాస నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరపున పోటీచేస్తున్నారు.

ఆగిన పనులు పూర్తి చేయిస్తా

- సారవకోట మండలానికి సాగు, తాగునీటి సౌకర్యం కల్పిస్తా
- వనిత మండల వంతెనను పూర్తిచేసేందుకు కృషిచేస్తా
- నరసన్నపేట టీడీపీ అభ్యర్థి బగ్గు రమణమూర్తి

ఇంటర్వ్యూ



(నరసన్నపేట)

రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి వస్తుందని, వైసీపీ రాక్షస పాలనకు అంతం తప్పదని నరసన్నపేట నియోజవకర్గ టీడీపీ అభ్యర్థి బగ్గు రమణమూర్తి అన్నారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే గతంలో తాను చేసిన అభివృద్ధికి మరింత రెట్టింపు చేస్తానని, గత పాలకులు సగంలో ఆపేసిన పనులను పూర్తిచేస్తానని తెలిపారు. నరసన్నపేట నియోజవర్గంలో తాగు, సాగునీటికి ఇబ్బంది లేకుండా చూస్తానని, నరసన్నపేట పట్టణాన్ని సర్వసుందరంగా తీర్చిదిద్దుతానని స్పష్టం చేశారు. ఆయనతో 'ఆంధ్రజ్యోతి' మంగళవారం ముఖాముఖి నిర్వహించింది. ఈ సందర్భంగా పలు ప్రశ్నలకు రమణమూర్తి సమాధానాలు చెప్పారు.

➡ **ప్రశ్న:** మూడోసారి బరిలో నిలబడ్డారు. నియోజకవర్గ ప్రజలకు ఏమిచేయాలనుకున్నారు?

➡ **జవాబు:** గతంలో నేను ఎమ్మెల్యేగా ఉన్నసమయంలో నియోజకవర్గంలో సుమారు రూ.1200 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టాం. ఇందులో చాలాపూర్తి చేశాం. సారవకోట మండలం బొంతు ఎత్తిపోథల పథకం, శ్రీముఖలింగం రక్షిత మంచినీటి పథకం, వనిత మండలం వంతెన తదితర పనులు 60 శాతం మేరకు పూర్తిచేశాం. ఆ తరువాత అధికారంలో వచ్చిన వైసీపీ ఈ పనులను పూర్తి చేయకుండా వదిలేసింది. నేను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే ఈ పనులను పూర్తి చేయిస్తా. సారవకోట, జలుమూరు మండలాలకు తాగు, సాగునీరు సమస్య లేకుండా చేయడమే ప్రధాన లక్ష్యం. నుసరాం తుంపర భూములు, మడపాం ఎత్తిపోథల పథకం, పట్టణాభివృద్ధికి శ్రీకారం చుడతా.

➡ **ప్ర:** ప్రజలకు అందుబాటులో ఉంటారా?

➡ **జ:** నా ఇంటి తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయి. ప్రజలకు ఏ అవసరం వచ్చినా రావచ్చును. లేదా ఫోన్ చేసినా స్పందిస్తాను. నియోజకవర్గ ప్రజలకు ఏ ఆపద వచ్చినా రాజకీయాలకు అతీతంగా ఆదుకునేందుకు సిద్ధంగా ఉన్నాను.

➡ **ప్ర:** నరసన్నపేట పట్టణాన్ని అభివృద్ధి చేస్తారా?

➡ **జ:** కచ్చితంగా. నరసన్నపేట పట్టణంలో ఉన్న రాజులు చెరువు అభివృద్ధికి గతంలో రూ.50లక్షలు మంజూరు చేశా. ప్రభుత్వం మారగానే ఆ చెరువును గాలికి వదిలేశారు. ఈసారి అధికారంలోకి వచ్చిన వెంటనే రాజులు చెరువును అభివృద్ధి చేస్తా. చెరువును పార్కుగా తీర్చిదిద్ది ట్రాక్ ఏర్పాటు చేస్తాం. అలాగే ఇండోర్ స్టేడియం నిర్మించడంతో పాటు జమ్ము జంక్షన్ నుంచి సత్యవరం జంక్షన్ వరకు సెంట్రల్ లైటింగ్ పూర్తి చేస్తా. పల్లిపేట రోడ్డును ఈదులవలస జంక్షన్ వరకు అభివృద్ధి చేస్తాను. భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తా. ఎర్రన్నాయుడు పార్కును వైసీపీ నాయకులు కూలగొట్టారు. దాన్ని మళ్లీ పునర్నిర్మించి ప్రజలకు అంకితం చేస్తాం.

➡ **ప్ర:** రైతుల సమస్యలను ఎలా పరిష్కారిస్తారు?

➡ **జ:** గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వంశధార కాలువలను ఆధునికీకరించి కొంత వరకు రైతులకు సాగునీరు అందించాం. వైసీపీ ప్రభుత్వం వంశధార కాలువలను పట్టించుకోకపోవడంతో గుర్రపు డెక్క, పూడికతో నిండిపోయాయి. దీనివల్ల పోలాకి, నరసన్నపేట మండలాల్లోని శివారు రైతులకు నీరు అందడం లేదు. ఈసారి అధికారంలో వచ్చిన వెంటనే ఓపెన్‌హెడ్ చానళ్ల ద్వారా పాత కాలువలకు సాగునీరు వచ్చేటట్లు చేస్తా. వంశధార కాలువల ఆధునికీకరణను పూర్తిచేస్తాం.

➡ **ప్ర:** మత్స్యకారులు, గిరిజనుల అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

➡ **జ:** పోలాకి మండలంలో మత్స్యకారులు ఎక్కువగా ఉన్నా రు. మత్స్యకార గ్రామాల్లో రోడ్లు ఏర్పాటు చేస్తాం. చేపలను నిల్వ చేసుకునేందుకు కోల్డ్ స్టోరేజ్‌లు నిర్మిస్తాం. వారి జీవన ప్రమాణాలు స్థాయి పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసు కుంటాం సారవకోట మండలంలోని గిరిజనులకు తాగునీటి సౌకర్యం కల్పిస్తాం. వారి పంటలను కొనుగోలు చేసేందుకు సారవకోటలో ఒక మార్కెట్ యార్డును ఏర్పాటు చేస్తాం.

➡ **ప్ర:** యువతకు ఉపాధి కల్పిస్తారా?

➡ **జ:** కచ్చితంగా. నియోజవర్గం ఎక్కువగా వ్యవసాయ ఆధారిత ప్రాంతం. కనుక ఈ ప్రాంతంలో ఫుడ్‌ప్రోసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాం. వారి నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేస్తాం. పారిశ్రామికంగా అభివృద్ధికి నా వంతు కృషి చేస్తా.

➡ **ప్ర:** వంశధార వరదల నుంచి నదితీర గ్రామాల ప్రజలను రక్షించేందుకు ఏం చేస్తారు?

➡ **జ:** జలుమూరు మండలం కరకవలస నుంచి పోలాకి మండలం పల్లిపేట వరకు కరకట్టలు లేకపోవడంతో వరదల సమయంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో రూ.50లక్షలతో పనులు చేశాం. గ్రోయిన్లు ఏర్పాటు చేశాం. ఈసారి అధికారంలోకి వచ్చిన వెంటనే రక్షణగోడలను ఏర్పాటు చేస్తాం.



మీరెక్కడుంటే.. మేమక్కడుంటాం

- ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు అభ్యర్థుల పాట్లు
- చెరువులు, పొలాల్లో ప్రచారం

(నరసన్నపేట)

పోలింగ్ తేదీ సమీపిస్తుండడంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రచార జోరును పెంచారు. మరో నాలుగు రోజుల్లో ప్రచారం కూడా నిలిపివేయాల్సి ఉండడంతో అభ్యర్థులు, నాయకులు ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి సర్వశక్తులూ ఒడ్డుతున్నారు. ఎండలు అతి తీవ్ర రూపం దాల్చడాన్ని దృష్టిలో పెట్టుకొని ఇప్పటికే ప్రచార సమయాలను వాతావరణానికి అనుగుణంగా మార్చుకున్నారు. ఇప్పుడు ఓటర్లు ఎక్కడుంటే అక్కడికే పరుగులు తీస్తున్నారు. ప్రస్తుతం అంతటా ఉపాధి హామీ పనులు ముమ్మరంగా జరుగుతుండడంతో, అధిక సంఖ్యలోఉన్న వేతనదారులు, పొలం పనులకు వెళ్తున్న వ్యవసాయ కూలీలు, వ్యవసాయదా రులను కలవడం కోసం చెరువులు, పొలాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఏ రోజు ఎక్కడ ఉపాధి పనులు జరుగుతున్నాయో తెలుసుకొని సంబంధిత గ్రామ నాయకులను తీసుకొని అభ్యర్థులు ప్రచారానికి బయలుదేరుతున్నారు. వేతనదారులతో మాట్లాడుతూ వారి సమస్యలను తెలుసుకుంటున్నారు. పార్టీ అధికారంలోకి వస్తే.. ముందుగా ఉపాధి వేతన దారుల సమస్యలు పరిష్కరించడానికి చొరవ తీసుకుంటామని హామీ ఇస్తున్నారు. వలస ఓటర్లను గుర్తించి, సంఖ్యను బట్టి వారు నివాసం ఉండే ప్రాంతాలకు కొంతమంది అభ్యర్థులు తమ మనుషులను పంపించి మాట్లాడిస్తున్నారు. లేదా వారే స్వయంగా వెళ్లి ఓటర్లను కలుస్తున్నారు. పార్టీలు ప్రకటించే మేనిఫెస్టోతో పాటు తాము గెలిస్తే, వ్యక్తిగతంగా ఏదో ఒకటి చేస్తామని హామీ ఇస్తున్నారు. పోలింగ్ తేదీ నాటికి గ్రామానికి వచ్చి తమకు ఓటేయాల్సిందిగా ప్రాధేయపడుతున్నారు. ఎన్నికల్లో గెలిచి, అధికారం చేతికొచ్చాక, తమ అపాయింట్‌మెంట్ కోసం చుక్కలు చూపించే నాయకులు.. ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తుండడంతో ఓటర్ల అపాయింట్ మెంట్ కోసం తహతహలాడడం విస్మగొలుపుతోంది.

ప్రచారానికి వెళ్తే పసందైన విందు



నరసన్నపేట: పార్టీపై అభిమానాన్ని చాటుకునేందుకు పలువురు నాయకులు ప్రచారానికి వెళ్తున్నారు. వారికి అభ్యర్థులు పసందైన విందు భోజనం, అల్పాహారం ఏర్పాటు చేస్తున్నారు. ఆ తర్వాత మజ్జిగ ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లు ఇస్తున్నారు. మధ్యాహ్నం గ్రామంలో ఇద్దరు, ముగ్గురు లేదా పార్టీ శ్రేణులు చందాలు వేసుకుని ఒక చోట భోజనాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో శాకాహార, మాంసాహార వంటకాలను పెడుతున్నారు.



ఓటుకు ఎంతిద్దాం?

(టెక్కలి)

ఈసారి ఓటుకు ఎంతిస్తాం అన్న దగ్గర రాజకీయ పార్టీలు మల్లగుల్లాలు పడుతున్నాయి. ఏదైనా పార్టీ నాయకులు ఇచ్చిన తర్వాతే మనమూ ఇద్దాములే అని మిగతా పార్టీ నేతలు చూస్తున్నారు. ఎవరు ముందు డబ్బులు పంపిణీ చేస్తారా? అంటూ వారు ఎదురుచూస్తున్నారు. గ్రామాల్లోని ఓటరుకు ఒకరేటు, పట్టణాల్లోని ఓటరుకు ఒకరేటు ఇద్దాములే అంటూ చెవులు కొరుక్కుంటున్నారు. డబ్బులు ఎలా పంపిణీ చేయాలి, ఓటరుకు స్లిప్పుతో కలిపి ఇస్తామా, ముందే ఇస్తామా అని ఆయా పార్టీల ద్వితీయశ్రేణి నాయకులు చర్చించుకుంటున్నారు. డబ్బులతో పాటు మందుబుడ్డీ ఇవ్వకతప్పదు. ఎప్పటికైనా ఇవ్వాలి కదా మన ఓటరు ఎవరో గుర్తించండి పంపిణీ చేద్దామంటూ చెప్పు కుంటున్నారు. బూత్‌లవారీగా పరిశీలించి లిస్టలను కార్యకర్తలు సిద్ధం చేస్తున్నారు. ఏ రాజకీయ పార్టీ వారు డబ్బులిచ్చినా తీసుకుందాం అంటూ ఓటర్లు సిద్ధమవుతున్నారు.

జన కేతనం
ఆంధ్రజ్యోతి
బుధవారం 8 మే 2024

పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్న ఉద్యోగులు

టెక్కలి, మే 7: టెక్కలి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 164మంది మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోస్టల్‌బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు. పోలీసులు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణం వద్ద బందోబస్తు నిర్వహించారు. **ఆమదాలవలస:** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ కేంద్రంలో మంగళవారం నాలుగో రోజు 245 మంది ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొదటి రోజు 988 మంది, రెండో రోజు 1397 మంది, మూడో రోజు 243 మంది మొత్తం ఈ పోలింగ్ కేం ద్రంలో 2,873 మంది ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

2 నెలలైంది..

- నిరుపయోగంగా పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు
- ప్రారంభించి వదిలేసిన మంత్రులు
- కొన్ని భవనాల పనులే పూర్తికాలేదు
- మండిపడుతున్న ప్రజలు



ఇచ్ఛాపురం మునిసిపాలిటీ పురుషోత్తపురంలో నిరుపయోగంగా ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

(ఇచ్ఛాపురం)

ఎన్నికల కోడ్ వస్తుందని రెండు నెలల కిందట వైసీపీ మంత్రులు ఆదరాబాదరాగా పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ప్రారంభించేశారు. ఆ తరువాత ఎటువంటి కార్యకలాపాలు చేపట్టకుండా నిరుపయోగం వదిలేశారు. అసలు కొన్ని భవనాల పనులే పూర్తికాలేదు. అయినా వైసీపీ నేతలు అత్యుత్సాహంతో వీటిని ప్రారంభించేశారు. దీనిపై ప్రజలు మండిపడుతున్నారు. జిల్లాలోని పట్టణ ప్రాంతాల్లో ఆరోగ్య కేంద్రాలు శిథిలావస్థకు చేరాయి. మరికొన్ని చోట్ల ఇరుగ్గాఉండే అద్దెభవనాల్లో కొనసాగుతున్నాయి. దీంతో రోగులకు పూర్తిస్థాయిలో సేవలందడంలేదు. ఈ నేపథ్యంలో శ్రీకాకుళం నగర పాలక సంస్థ పరిధిలో ఏడు, ఇచ్ఛాపురం మునిసిపాలిటీలోని బెల్లుపడ, పురుషోత్తపురం, ఆమదాలవలస, పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీలకు రెండుచొప్పున పట్టణ పీహెచ్‌సీలను మంజూరుచేశారు. పనులు కొంతమేర చేపట్టారు. ఇంతలో సాధారణ ఎన్నికల సమయం దగ్గరపడుతుందని, కోడ్ వచ్చిన తర్వాత ప్రారంభించడానికి వీలుండదని, ప్రభుత్వం మారితే వారి ఖాతాలోకి వెళ్లిపోతుందని వైసీపీ నేతలు భావించి ఆదరాబాదరాగా ఈ భవనాలను ప్రారంభించేశారు. రెండు నెలల కిందట 13 అర్బన్ హెల్త్ సెంటర్లను మంత్రులు ప్రారంభించారు. కొన్నిచోట్ల పనులు పూర్తికాకపోవడంతో వినియోగించడానికి వీల్లేకుండాపోయింది. దీంతో ఆ భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. ప్రస్తుతం అద్దె, శిథిలావస్థకు చేరిన భవనాల్లో యూపీహెచ్‌సీలను నిర్వహిస్తుండడంతో రోగులు, సిబ్బందికి అవస్థలు తప్పడంలేదు. నూతన భవనంలో వైద్య సేవలు అందుతాయని భావించిన రోగులకు నిరాశే మిగులుతోంది.

వినియోగంలోకి తీసుకొస్తాం


జిల్లాలోని 13 అర్బన్ హెల్త్ సెంటర్ల భవనాలు కొన్ని చోట్ల చిన్నచిన్న పనులు మిగిలిన్నాయని డీఎంహెచ్‌వో బి.సూర్యకుమారి తెలిపారు. రెండు, మూడు రోజుల్లో పూర్తి చేసి వారం రోజుల్లో వినియోగంలోకి తీసుకువస్తామని చెప్పారు. 13 సెంటర్లలో ఒకటి రెండు చోట్ల తప్పా అన్ని సెంటర్లులో పూర్తి స్థాయి వైద్య సిబ్బంది ఉన్నారని చెప్పారు. త్వరలో ప్రజలకు నూతన అర్బన్ సెంటర్ల ద్వారా మంచి సేవలు అందజేస్తామని తెలిపారు.

బిక్కుబిక్కుమని విధులు

జిల్లాలోని 13 భవనాలు ప్రారంభించినా యూపీహెచ్‌సీలను అక్కడికి మార్చలేదు. నూతన భవనాలు ప్రారంభించడంతో తమ అవస్థలు తీరుతాయని భావించినా, నేటికీ అవస్థలు తప్పడంలేదని, బిక్కు బిక్కుమని విధులు నిర్వహిస్తున్నామని వైద్యులు, సిబ్బంది చెబుతున్నారు. ప్రతిరోజూ ఒక్కో అర్బన్ హెల్త్ సెంటర్‌కు వందమందికి పైగా రోగులు వస్తున్నారు. ఇచ్ఛాపురం మునిసిపాలిటీలోని బెల్లుపడ, పురుషోత్తపురంల్లో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో విద్యుత్ తదితర పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఎన్నికల కోడ్ వస్తుందని భావించి మంత్రి అప్పలరాజు రాత్రికి రాత్రే ప్రారంభించారు. బెల్లుపడలో పట్టణ ఆరోగ్య కేంద్రం భవనం ప్రారంభించిన సమయంలో మంత్రి అసహనం వ్యక్తంచేసిన విషయం విదితమే. లోపలికి వెళ్లిచూసే సరికి విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో అసహనానికి గురై గదులు ప్రారంభించడానికి కట్టిన రిబ్బన్లు మంత్రి చింపి పారేశారు. అప్పట్లో అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రస్తుతం బెల్లుపడలో నిర్మించిన భవనం కార్లు పార్కింగ్‌కు, ఆవులు విశ్రాంతికి ఉపయోగపడుతోంది.

పోలింగ్ కేంద్రాలపై నిఘా

- అన్ని కేంద్రాలకు జియో ట్యాగింగ్
- పోలింగ్ సరళిని తెలుసుకునేలా చర్యలు
- ఎక్కడి నుంచైనా పరిశీలించేలా ఏర్పాట్లు
- సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి





(నరసన్నపేట)

సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది. ప్రధానంగా ఎన్నికల్లో కీలకంగా ఉండే పోలింగ్‌కేంద్రాలపై అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నారు. ఎటువంటి లోటుపాట్లు లేకుండా సమర్థవంతంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. పోలింగ్ తేదీ సమీపిస్తుండడంతో తీసుకోవల్సిన చర్యలపై దృష్టిసా రించారు. ఇప్పటికే పోలింగ్‌కేంద్రాలను జియోట్యాగింగ్ చేశారు. దీనికోసం లాంగిట్యూడ్, లాటిట్యూడ్ ప్రక్రియను పూర్తిచేశారు. దీంతో రాష్ట్రంలోని ఏప్రాంతం నుంచైనా ఏ పోలింగ్ స్టేషన్‌లో ఏం జరుగుతుందో అధికారులు తెలుసుకోవచ్చు. జిల్లా, నియోజకవర్గం మండల కేంద్రాలే కాకుండా మారుమూల గ్రామాల్లో పోలింగ్ స్టేషన్ జియో ట్యాగింగ్‌కూడా పూర్తిచేశారు. ఇందుకోసం ప్రతి పోలింగ్‌స్టేషన్ ఫొటోలను పోలీసులు సేకరిం చి జియో ట్యాగింగ్ చేశారు. తద్వారా పోలింగ్ స్టేషన్ సమీపంలో అనుకోని సంఘటనలు, గొడవలు జరిగితే రాష్ట్ర, జిల్లాస్థాయిలో తక్షణమే గుర్తించి నివారణ చర్యలు చేపట్టడం వీలవుతుందని అధికారులు చెబుతున్నారు.

పకడ్బందీగా నిర్వహణ

జిల్లాలో పకడ్బందీగా పోలింగ్ నిర్వహించడానికి అధికారులు దృష్టి సారించారు. ఈనెల 13న పోలింగ్ జరగనున్న నేపథ్యంలో పోలీసులు ముందస్తుగా సున్నితమైన, అతిసున్నితమైన ప్రాంతాలు, అత్యంత సున్నితమైన ప్రాంతాలను గుర్తించారు. జిల్లాకు ఇప్పటికే చేరుకున్న ప్రత్యేక పోలీసు బలగాలతో కవాతాలు నిర్వహించారు. ఆయా ప్రాంతాల ప్రజలకు భరోసాకల్పించేలా పోలీసు యంత్రాంగం ప్రయత్నిస్తోంది. గత ఎన్నికల సమయంలో ఏయే పోలింగ్ కేంద్రాల వద్ద గొడవలు జరిగాయో గుర్తించారు. ఆయా కేంద్రాలకు అదనపు బలగా లను కేటాయిస్తున్నారు.

పాత నేరస్థులపై నిఘా..

ఆయా పోలింగ్‌కేంద్రాల పరిధిలో గల పాతనేరస్థులపై పోలీసులు నిఘా పెంచారు. పలు వురు హిస్టరీ షీట్స్ ఉన్న వ్యక్తులు, గొడవలు సృష్టించే వీలున్న వ్యక్తులు, పాత నేరస్థులను ఇప్పటికే బైండోవర్ చేశారు.కొత్తగా వారిపై ఏమైనా కేసులు నమోదయ్యాయా, ఎక్కడెక్కడకు వెళ్తున్నారు, ఎవరిని కలుస్తున్నారన్న అంశాలపై పోలీసులు నిఘాపెట్టారు. ఆయుధాలు కలిగిన వ్యక్తులను గుర్తించి ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు సంబంధిత ఆయుధాలను ఆయా పోలీసు స్టేషన్‌ల్లో డిపాజిట్ చేయాల్సిందిగా సూచించారు.

సీసీ కెమెరాలతో

ఎన్నికలకు పోలీసుశాఖ తీసు కుంటున్న చర్యల్లో భాగంగా పోలింగ్‌కేంద్రాల వద్ద, ఇతర ప్రాంతాల్లో సీసీ కెమోరాలను అమర్చారు. అన్ని అన్నికేంద్రాల్లో సీసీ కెమెరాలను బిగించి నిఘాను ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాలను జియోట్యాగింగ్ చేసిన అనంతరం మండల కేంద్రాల్లోని పోలీసు స్టేషన్‌కు అనుసంధానం చేస్తున్నారు. ఇందుకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను అందుబాటులోకి తీసుకు వచ్చారు. తద్వారా ప్రతి పోలింగ్‌స్టేషన్ పోలింగ్‌సరళిని, ఇతర అంశాలను ఇటు జిల్లా ఆటురాష్ట్ర స్థాయి అధికారులు పర్యవేక్షించడం సులభతరం కానుంది



టెక్కలి: కోటబొమ్మాళి మండలం కుంభంపేటలో ప్రచారం చేస్తున్న అచ్చెన్నాయుడు

కూటమి అభ్యర్థులకు నీరాజనం

- గ్రామాల్లో ముమ్మరంగా ఎన్నికల ప్రచారం

టెక్కలి/సరుబుజ్జిలి/వజ్రపుకొత్తూరు/కవిటి/నరసన్నపేట/అరసవల్లి/రణస్థలం/పాతపట్నం: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులు విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రజలు వారికి నీరాజనం పలుకుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అన్ని సమస్యలు పరిష్కరిస్తామని ప్రజలకు హామీ ఇస్తున్నారు. తమను గెలిపించాలని ఓటర్లను కోరుతున్నారు. మంగళవారం కోటబొమ్మాళి మండలం కుంభంపేటలో టెక్కలి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కింజరాపు అచ్చెన్నాయుడు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సరుబుజ్జిలి మండలంలో ఆమదాలవలస నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కూన రవికుమార్, శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, వజ్రపుకొత్తూరు మండలం పెద్దబడాంలో పలాస నియోజకవర్గ అభ్యర్థి గౌతు శిరీష, కవిటి మండలం పెద్దకర్రివాని పాలెంలో ఇచ్ఛాపురం నియోజక వర్గ అభ్యర్థి బెందాళం అశోక్, నరసన్నపేట మండలం చెన్నాపురంలో నియోజకవర్గ అభ్యర్థి బగ్గు రమణమూర్తి, శ్రీకాకుళం రూరల్ మండలంలో నియోజకవర్గ అభ్యర్థి గొండు శంకర్, పాతపట్నంలో నియోజకవర్గ అభ్యర్థి మామిడి గోవిందరావు, రణస్థలంలో నియోజక వర్గ అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు ప్రచారం నిర్వహించారు.



సరుబుజ్జిలి: రోడ్‌షోలో విక్టరీని చూపిస్తున్న రామ్మోహన్‌నాయుడు, రవికుమార్



రణస్థలం: కరపత్రాన్ని విడుదల చేస్తున్న ఎన్ఈఆర్



వజ్రపుకొత్తూరు: పెద్దబడాంలో ఎన్నికల ప్రచారంలో గౌతుశిరీష



అరసవల్లి: శ్రీకాకుళంరూరల్ మండలంలో ప్రచారం చేస్తున్న గొండు శంకర్



కవిటి: పెద్దకర్రివానిపాలెంలో ప్రచారం నిర్వహిస్తున్న బెందాళం అశోక్



పాతపట్నం: ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మామిడి గోవిందరావు



నరసన్నపేట: చెన్నాపురం పంచాయతీలో ప్రచారం చేస్తున్న బగ్గు రమణమూర్తి

మాకు తెచ్చివ్వండంతే..

- మందుబాబుల డిమాండ్
- మద్యం సమకూర్చలేక నాయకుల అవస్థలు
- అధికారుల దాడులతో హడలుతున్న వైనం



నరసన్నపేట: ఓటర్లను కాపాడుకునేందుకు వివిధ పార్టీల అభ్యర్థులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఈ ఎన్నికల్లో ధన ప్రవాహంతో పాటు మద్య ప్రవాహ మూ అధికంగా ఉంది. దీంతో మందు బాబులకు వారు కోరినంత మద్యం ఇవ్వలేక నేతలు అవస్థలు పడుతున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నాటి నుంచి మద్యం షాపుల్లో అమ్మకాలపై నియంత్రణ విధించారు. ఒక వ్యక్తికి ఒకే సీసా వం టి విధానంతో మద్యం ప్రవాహానికి అడ్డుకట్ట పడింది. దీంతో మందుబాబులు తాము కోరిన సమయానికి మందు అందకపోతే నాయకులను నిందిస్తున్నా రు. ఎన్నికల సమ యం కావడంతో నాయకులు తప్పనిసరై ఆ నిందలు భరించాల్సి వస్తోంది. ప్రస్తుతం ఎన్నికల ఫ్లయింగ్‌స్క్వాడ్‌లు అమ్మకాలపై గట్టి నిఘా పెట్టడంతో మద్యం దుకాణం నుంచి పరిమితికి మించి సీసాలు వెళితే వారికి సమచారం అందిపోవడం... వెంటనే రంగంలోకి దిగిపోతుండడం.. స్వాధీనం చేసుకుంటుండడంతో మందుబాబులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో నాయకులు వారి చేతికి డబ్బులిచ్చి.. కొనుక్కోవాలని సూచించినా మందు బాబులు ససేమిరా అంటున్నారు. నేరుగా మద్యం అందించేలా చూడాలని కోరు తున్నారు. నాయకులదీ అదే సమస్య. డబ్బులు ఎలాగోలా సర్దొచ్చు. వారు కోరినంత మద్యం ఎలా అందించాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు.

రహస్య ప్రాంతాల్లో మద్యం నిల్వలు

పోలింగ్ నేపథ్యంలో మద్యం సేకరణకు నాయకులు దృష్టి సారించారు. చెక్‌పోస్టుల వద్ద పకడ్బందీగా తనిఖీలుచేస్తుండడం, సారానిల్వలపై దాడులుచేస్తుండడంతో నాయకులు ఉక్కిరిబిక్కిరవు తున్నారు. మద్యం లేకపోతే యువకులు ఎన్నికల్లో తిరిగేందుకు ముందుకురావడంలేదు. ప్రచారంలో భాగంగా సభలు, సమావేశాలు జరిగే సమయంలో కూడా మద్యం కీలకం కావ డంతో ఎక్కడెక్కడ దొరకుతుందని అభ్యర్థులు ఆరాతీస్తున్నారు. కొంతమేర నియోజవర్గంలోని మద్యం షాపులు, బెల్ట్‌సాపులు నుంచి కొనుగోలు చేసి రహస్య ప్రాంతాల్లో నిల్వ చేసుకుం టున్నారు. బార్ యాజమానులు కూడా ఎమ్మార్పీ కంటేఎక్కువ మొత్తంలో తీసుకుంటున్నారు. ఎన్నికల నామినేషన్లు పూర్తయిన తర్వాత మద్యం విక్రయాలు పెరిగాయని దుకాణాల నిర్వాహకులు చెబుతున్నారు. గత పదిరోజులుగా రోజుకు రెండుకోట్ల వరకూ విక్రయాలు జరుగుతున్నాయి. గత ఏడాది ఇదే సమయం కంటే సగటున రోజుకు 20 నుంచి 30 శాతం ఎక్కువగా విక్రయాలు జరిగాయని నిర్వాహకులు పేర్కొంటున్నారు.

ఖద్దరు ధరించాల్సిందే..

హరిపురం: ఎవరైనా ఖద్దరు దుస్తులు వేసుకొని ఉంటే ఆయన రాజకీయ నాయకుడని చెబుతారు. ఎందుకంటే ఆ ఖద్దరు దుస్తులను గంజి పెట్టి పాలిష్ చేయడంతో ధరించినవాడికి నలుగురిలో ప్రత్యేకంగా నిలుపుతాయి. ఎన్నికల సమయంలో అయితే చిన్నచితకా కార్యకర్తలు సైతం ఖద్దరు దుస్తులు ధరిస్తుంటారు. ప్రస్తుతం ఖద్దరు దుస్తులతోపాటు లెనిన్ దుస్తులు కూడా రాజకీయ నాయకులు అధికంగా ధరిస్తుం టారు. ఎన్నికల సమయంలో అయితే ఖద్దరు దుస్తులు, నిగనిగలాడే బూట్లు, వీలైతే చేతికి బంగారం బ్రాస్‌లైట్, చేతిలో ఖరీదైన ఫోన్, కళ్లకు బ్రాండెడ్ అద్దాలు పెట్టి కనిపిస్తారు. కొందరు నాయకుల కుదిరితే అందరి సమక్షంలో కారులో నుంచి దిగి దర్పం ప్రదర్శిస్తారు. ఇది అందరి నాయకులకు వర్తించనప్పటికీ కొందరు నాయకులు మాత్రం తగ్గరు. ఎన్నికలు ముగిసే వరకూ అద్దె కార్లతో పనికానిస్తుంటారు. కానీ ఇవి కూడా ఎందుకులే అనుకుంటున్న నాయకులు కార్యకర్తలు మాత్రం ఖద్దరు దుస్తులు కుట్టిస్తున్నారు. దీంతో వస్త్రదుకాణా ల్లో ఖద్దరు, లెనిన్ దుస్తుల విక్రయాలు గణనీయంగా పెరి గాయి. దీంతో టైలర్లుకు గిరాకీ పెరిగింది. దీంతోపాటు రడీమేడ్ వస్త్రాలు విక్రయాలు అదేరీతిలో జరుగుతున్నాయి. కొందరు కార్యకర్తలు సైతం ప్రచారంలో ఖద్దరు దుస్తులు ధరించి దర్పం ప్రదర్శిస్తున్నారు.

కూటమి విజయాన్ని ఎవరూ ఆపలేరు: శిరీష

వజ్రపుకొత్తూరు: రాష్ట్రంలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి విజయాన్ని ఎవరూ ఆపలేరని పలాస అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి గౌతు శిరీష అన్నారు. మంగళవారం పెద్దబడాం, బెండి, రెయ్యిపాడు, చిన వంక పంచాయతీ గుల్లపాడు, తాడివాడ, నువ్వలరేవు, కడిసింగి, రాజాం పంచాయతీల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శివారు ప్రాంతాలకు గడచిన ఐదేళ్లలో వంశధార నీరు అందించలేని మంత్రిగా అప్పలరాజు చరిత్రలో నిలిచిపోతారన్నారు. వరి, జీడి రైతులకు తీరని అన్యాయం చేశారన్నారు. కనీసం మత్స్యకారులకు న్యాయం చేయలేదని విమర్శించారు. ఎన్డీఏ ప్రభుత్వంలో రైతులు, మత్స్యకారులను అన్నివిధాలా ఆదుకుంటామన్నారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా రామ్మోహన్ నాయుడును గెలిపించాలని కోరారు. కార్యక్ర మంలో నేతలు సూరాడ మోహనరావు, దువ్వాడ హేంబాబు చౌదరి, కణతి సురేష్, ఎ.ఉమామహేశ్వరరావు, బి.శశిభూషణ్, దానేటి పద్మజీ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి వైసీపీ నేతలు



టీడీపీలో చేరిన మందస వైసీపీ నేతలతో శిరీష

పలాస/హరిపురం: నియోజక వర్గంలోని పలు ప్రాంతాల నుంచి వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీ లో చేరారు. పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వీరికి ఉమ్మడి అభ్యర్థి గౌతు శిరీష కండువాలు కప్పి ఆహ్వానించారు. 20 వార్డుకు చెందిన పిట్ట రవి, బద్రి రాజు అనుచరులు, మందసకు చెందిన 40, హరిపురం, కొండలోగాంలో నుంచి పదేసి వైసీపీ కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చు కున్నారు. వార్డు సభ్యులు నిమ్మల దుదిష్టి, వంకల రమేష్, తులసి, శ్రీనుతో పాటు ప్రజలు టీడీపీలో చేరారు. అలాగే మున్సిపాలిటీ 14వ వార్డు వలంటీరు కొండా ప్రవీణ్‌కుమార్ వెంకన్న చౌదరి సమక్షం లో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావు యాదవ్, గాలి కృష్ణారావు, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, అంబటి కృష్ణమూర్తి, శంకర్, డొంకూరు తిరుపతిరావు, లింగరాజు పాల్గొన్నారు.

ప్రజల ఆస్తుల దోపిడీయే జగన్ లక్ష్యం

● ఉమ్మడి అభ్యర్థులు రామ్మోహన్, రవికుమార్



టీడీపీలో చేరిన నేతలతో ఎంపీ రామ్మోహన్, కూన రవికుమార్

సరుబుజ్జిలి: రాష్ట్రంలో ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌తో ప్రజల ఆస్తులను దోపిడీ చేయడమే లక్ష్యంగా సీఎం జగన్ జీవోను అమలు చేస్తున్నారని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఆమదాలవలస అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి కూన రవికుమార్ అన్నారు. మంగళవారం యరగాం, చిన్నకాగితాపల్లి, చిగురువలస, సరుబుజ్జిలి, ఆమదాలవలస మునిసిపాలిటీ తిమ్మాపురం, పాత ఆమదాలవలస, కుద్దిరాం, మెట్టక్కివలస, అక్కివలస, పంతులుపేట ప్రాంతాల్లో రోడ్ షో నిర్వహించారు. ఈనెల 13న జరుగు ఎన్నికల్లో ఎంపీగా, ఎమ్మెల్యేగా తమను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పేడాడ సూరపు నాయుడు, గురువు తిరుమలరావు, శివ్వాల సూర్యనారాయణ, తమ్మినేని గీత, పేడాడ రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు. ● **సరుబుజ్జిలి:** మండలంలోని యరగాం గ్రామ పంచాయతీకి చెందిన ఉప సర్పంచ్ సాకేటి అసిరి నాయుడు, వార్డు మెంబర్ రావాడ సన్యాసిరావు వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరారు. టీడీపీలో చేరిన వారిలో సాధు గణపతి రావు, పొన్నాడ ముకుందరావుతో పాటు 20 కుటుంబాలున్నాయి. అలాగే చిగురువలస గ్రామా నికి చెందిన 20 కుటుంబాలు టీడీపీలో చేరా యి. ● **అరసవల్లి:** ఎన్డీయే గెలుపుతో చంద్రబాబు సారథ్యంలో నగరాభివృద్ధి సాధ్యపడుతుందని ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు సతీమణి శ్రావ్య, డాక్టర్ హరిత పేర్కొన్నారు. నగరంలోని కృష్ణాపార్కు, పుణ్యపువీధి, కానుకుర్తివారి వీధి, సున్నపు వీధి, తెలకల వీధి తదితర ప్రాంతాల్లో మాజీ కౌన్సిలర్ కెల్ల కొండలరావు ఆధ్వర్యంలో మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యేగా గొండు శంకర్, ఎంపీగా రామ్మోహన్ నాయుడును గెలిపించాలని కోరారు.

అబద్ధాల్లో జగన్‌కు గిన్నీస్ రికార్డు: అచ్చెన్నాయుడు



రొక్కం దొరకు కండువా కప్పి ఆహ్వానిస్తున్న కింజరాపు అచ్చెన్నాయుడు

టెక్కలి: ఐదేళ్ల పాటు ప్రజలను మోసం చేసేలా అబద్ధాలు ఆడడంలో సీఎం జగన్ గిన్నీస్ రికార్డు సాధించారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మంగళవారం పొడుగుపాడు, కుంభంపేట, దుప్పిలపాడు, దుర్గమ్మపేట తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చిరుజల్లులు పడుతున్నా తడుస్తూ ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజల ప్రాణాలతో చలగాటం ఆడుతున్న జగన్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు. రానున్న ఎన్నికల్లో కూటమి విజయానికి ప్రజలు సహకరించాలని, టీడీపీకి ఓటువేసి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో నేతలు వెలమల విజయలక్ష్మి, తర్ర రామకృష్ణ, నంబాళ్ల శ్రీనివాస్, వెలమల కామేశ్వరరావు, సాసుమంతు ఆనందరావు, కర్రి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.● టెక్కలి, నందిగాం మండలాల పరిధిలోని హర్షబాడ, భైరివూరు, నీలాపురం, బెల్లుకోల తదితర గ్రామాల నుంచి మంగళవారం వైసీపీ నేతలు టీడీపీలో చేరారు. వీరికి అచ్చెన్నాయుడు కండు వాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పినకాన అజయ్‌కుమార్, మళ్ల బాలకృష్ణ తదితరులు ఉన్నారు. ● కోటబొమ్మాళి మండలం దంత, కురుడు ప్రాంతాల్లో పట్టున్న వైసీపీ నాయకుడు రొక్కం దొర మంగళవారం టీడీపీలో చేరారు. ఆయనకు ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు కండువా కప్పి ఆహ్వానించారు. కింజరాపు కుటుంబంతోనే అభివృద్ధి సాధ్యమని, అందుకే తాను టీడీపీలో చేరానని దొర తెలిపారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

జగన్ పాలనలో రాష్ట్రం అధోగతి: అశోక్



సోంపేట: ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బెందాళం అశోక్

సోంపేట: సీఎం జగన్ పాలనతో రాష్ట్రం అధోగతి పాలైందని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. మంగళ వారం ఎర్రముక్కాం, సిరిమామిడి గ్రామాల్లో జనసేన ఇన్‌చార్జ్ దాసరి రాజు, బీజేపీ కన్వీనర్ నిర్మలా రెడ్డితో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌తో ప్రజల భూములకు రక్షణ కరువవుతుందన్నారు. రాష్ట్రాన్ని గాడిలో పెట్టాలంటే చంద్ర బాబు ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలని కోరారు.● **కవిటి:** సోంపేట పట్టణానికి చెందిన పలు వైశ్య కుటుంబాలు టీడీపీలో చేరాయి. రామయ్య పుట్టుగలో జరిగిన కార్యక్రమంలో వైసీపీ నాయకులు సానా షన్ముఖరావు, మల్ల నాగేష్, మల్లా షన్ము ఖరావుతోపాటు 100మంది చేరగా వారికి ఎమ్మెల్యే అశోక్ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఇద్ది వానిపాలెం, పెద్దకర్రివానిపాలెం, కొత్తపాలెం, గ్రామాల్లో అశోక్ ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా రామ్మోహన్ నాయుడును గెలిపించాలని కోరారు. ● **ఇచ్ఛాపురం:** ఇచ్ఛాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే బెందాళం అశోక్ సతీమణి నిలోత్పల మంగళవారం ఎన్నికల ప్రచారం చేశారు. కేసుపురం, సన్యాసిపుట్టుగ, నీలాపుపుట్టుగ, బూర్జుపాడు గ్రామా ల్లో ఇంటింటికీ వెళ్లి రానున్న ఎన్ని కల్లో ఎమ్మెల్యేగా అశోక్, ఎంపీగా రామ్మోహన్ నాయుడులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నేతలు డిల్లీరావు, సహదేవ్‌రెడ్డి, దక్కత శ్రీను, కామేష్, గోపి, పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

భూముల కబ్జాకే ల్యాండ్ టైటిలింగ్ చట్టం: శంకర్



అరసవల్లి: ప్రజల భూములు కబ్జా చేసేందుకే సీఎం జగన్ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను తీసుకువచ్చాడని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ ఆరోపించారు. ఈ మేరకు రాష్ట్ర పంచా యతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్, సంఘం రాష్ట్ర అధ్యక్షులు వానపల్లి లక్ష్మిలతో కలిసి తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లా డుతూ.. జగన్ భూ రక్షణ చట్టం పేరుతో భూ భక్షణకు పాల్పడుతున్నారని విమర్శించారు. దేశంలో ఎక్కడా ఈ చట్టం అమలు కావడం లేదని, ఇక్కడే ఎందుకు అమలు చేస్తున్నారో జగన్ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామ కృష్ణంనాయుడు, మాజీ ఎంపీపీ గొండు జగన్నాథరావు, మూకళ్ల శ్రీనివాసరావు, సింతు సుధాకర్, శీర రమణయ్య, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

శంకర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించండి

కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు వైవీబీరాజేంద్రప్రసాద్, రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షుడు వానపల్లి లక్ష్మి ముత్యాలరావు కోరారు. నగర పరిధిలోని శాంతినగర్ కాలనీలో మంగళవారం ప్రజాగళం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ నియోజకవర్గంలోని సమస్యలపై శంకర్‌కు పూర్తి అవగాహన ఉందని, సామాన్య కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి, విద్యా వంతుడైన శంకర్‌ను అసెంబ్లీకి పంపిస్తే నియోజకవర్గానికి మేలు జరుగుతుందన్నారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్, ఉమ్మడి మేనిఫెస్టోను వివరించారు. ● **శ్రీకాకుళం రూరల్:** పెద్దపాడు గ్రామ పంచాయతీ చెట్టువానిపేట, వానవాని పేట గ్రామాల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థి గొండు శంకర్ మంగళవారం ప్రజాగళం, బాబు సూపర్ సిక్స్ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. **గార:** మండలంలో గొండు శంకర్ సతీమణి గొండు స్వాతి మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

పనిచేసే వారినే గెలిపించండి: బగ్గు రమణమూర్తి



టీడీపీలో చేరిన వారికి కండువా వేస్తున్న ఉమ్మడి అభ్యర్థి బగ్గు రమణమూర్తి

నరసన్నపేట: నియోజకవర్గంలో ప్రజల కోసం నిరంతరం పనిచేసే వారికే గెలిపించాలని ఉమ్మడి అభ్యర్థి బగ్గు రమణమూర్తి అన్నారు. మంగళవారం చెన్నాపురం పంచాయతీ గొనపపేట, మెయ్యవానిపేట, చెన్నాపురం గ్రామాల్లో ప్రచారం నిర్వహిం చారు. రాష్ట్ర భవిష్యత్ కోసం చంద్రబాబును సీఎంగా చేయాలన్నారు. ఈనెల 13న జరిగే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా రామ్మోహన్ నాయుడును గెలి పించాలని కోరారు. కార్యక్రమంలో నేతలు డోల జగన్, చిట్టిబాబు, జల్లు చంద్రమౌళి, అడపా చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. వైసీపీ నేత కొంక్యాన బాబ్జీ తన అనుచరులతో టీడీపీలో చేరారు. జమ్ము పంచాయతీ దశుమంతుపురం, రావాడపేట గ్రామాల్లో టీడీపీ నియోజవర్గ సోషల్ మీడియా కన్వీనర్ బగ్గు అర్చన ఇంటింటా ప్రచారం చేశారు.

జలుమూరు: నరసన్నపేట అసెంబ్లీ అభ్యర్థి బగ్గు రమణమూర్తి సతీమణి మాజీ జడ్పీటీసీ బగ్గు సుగుణమ్మ దరివాడ, ఊడిగలపాడు, చల్లవానిపేట, పంగవానిపేట గ్రామాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యేగా బగ్గు రమణమూర్తి, ఎంపీగా కింజరాపు రామ్మోహననాయుడును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వెలమల రాజేంద్రనాయుడు, చల్లవానిపేట, లింగాలవలస, మర్రివలస సర్పంచ్‌లు పంచిరెడ్డి రామచంద్రరావు, దుంగ స్వామిబాబు, బగ్గు గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి: ఎన్ఈఆర్

రణస్థలం: ఉద్యోగుల సమస్యల పరిష్కారాన్ని అన్ని విధాలా కృషి చేస్తానని ఎన్డీఏ ఎచ్చెర్ల బీజేపీ అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. చంద్రబాబు గెలుపు.. పెన్షనర్ల పిలుపు కరపత్రాలను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ.. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందని, కూటమి ప్రభుత్వంలో వాటిని పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం ఉత్తరాంధ్ర జిల్లాల ప్రతినిధి యు.కూర్మారావు, ఎం.ప్రసాద రావు, ఎం.రామారావు, ఎస్.అప్పల నాయుడు, టి.జోగారావు, ఎం.కృష్ణానందం, బాలి రామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

గెలిపించండి..అభివృద్ధికి బాటలు వేస్తాం



జి.సిగడాం: వైసీపీ కుటుంబాలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎన్ఈఆర్

జి.సిగడాం: కూటమి అభ్యర్థులను గెలిపించాలని, అభివృద్ధికి బాటలు వేస్తామని ఎమ్మెల్యే అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్), ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పల నాయుడు అన్నారు. మంగళవారం బాతువ, నక్కపేట గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కూటమి విజయంతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కుమరాపు రవి కుమార్, వజ్జపర్తి రఘురాం, మీసాల రవికుమార్, టంకాల మౌళీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ● వెలగాడ గ్రామానికి చెందిన వైసీపీకి చెందిన 20 కుటుంబాలు మంగళవారం ఎన్డీఏ కూటమిలో చేరాయి. వీరికి ఎన్డీఏ అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) కండువాలు కప్పి ఆహ్వానించారు. జనసేన మండల అధ్యక్షుడు మీసాల రవికుమార్, పొగిరి అప్పల నాయుడు ఆధ్వర్యంలో వారంతా కూటమిలో చేరారు.

ఒక్క చాన్స్‌తో అభివృద్ధి గల్లంతు: గోవిందరావు



ప్రచారం నిర్వహిస్తున్న ఎన్డీఏ అభ్యర్థి మామిడి గోవిందరావు

పాతపట్నం: ఒక్క చాన్స్ పేరుతో అధికారంలో వచ్చిన వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో అభివృద్ధిని గల్లంతు చేసిందని ఎన్డీఏ అభ్యర్థి మామిడి గోవిందరావు అన్నారు. పాతపట్నం పరిధి కె.గోపాలపురం హెచ్.గోపాలపురం గ్రామాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. మహేంద్రతనయ నదిపై కాజ్‌వే ఎత్తు పెంచేందుకు పాటుపడతానన్నారు. అనంతరం మండల పరిధిలోని చంగుడి, సరాళి, తిడ్డిమి, తిడ్డిమి కాలనీ, భైరాగిపేట, దశరథపురం తదితర గ్రామాల్లోనూ సూపర్ సిక్స్, ఉమ్మడి మేనిఫెస్టోను వివరిం చారు. నియోజకవర్గ అభివృద్ధిపై నిర్లక్ష్యం వహించిన ఎమ్మెల్యే రెడ్డి శాంతికి ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పా లన్నారు. తాను ప్రజలకు ఎల్ల వేళలా అందుబాటులో ఉంటానని, అభివృద్ధే లక్ష్యంగా సేవలందిస్తా మన్నారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా రామ్మోహన్ నాయుడును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పైల బాబ్జీ, నందిగాం ఆనందరావు కూటమి నేతలు తదితరులు పాల్గొన్నారు. గోవిందరావు తనయుడు సాయి గణేష్ మిరియాపల్లిలో ప్రచారం చేశారు. ● **కొత్తూరు:** పాతపట్నం నియోజకవర్గ ఎన్డీఏ కూటమి అభ్యర్థి మామిడి గోవిందరావు సతీమణి సుధీష్ణ గూనభద్ర పంచాయతీలో ప్రచారం నిర్వహించారు.

82 కిలోల గంజాయి స్వాధీనం



కంచిలి: అంపురం జాతీయరహదారిలో ఎస్ఎస్‌టీ చెక్‌పోస్టు వద్ద మంగళవారం ఎస్ఎస్‌టీ టీం సభ్యులు 82.570 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. టీం సభ్యులు, డీటీ సంతోష్, కంచిలి పోలీసుల కథనం మేరకు.. ఇచ్ఛాపురం నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనంలో మూడు ప్లాస్టిక్ సంచులతో సుమారు 40 ప్యాకెట్లు గంజాయిని గుర్తించారు. ఒక్కో ప్యాకెట్ సుమారు రెండున్నర కిలోలు ఉండగా, గంజాయి విలువ సుమారు రూ.4,12,850 ఉంటుంది.సంఘటనపై కంచిలి ఎస్ఐ జి.రాజేష్ కేసు నమోదుచేశారు. వాహనాన్ని నిలుపుదలచేసి ప్లాస్టిక్ సంచులు తెరిచే సమయంలో నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. తనిఖీల్లో ఆర్అండ్‌బీ ఏఈ ఎం. మోహన్‌రావు, పోలీసు సిబ్బంది అశోక్, వీఆర్వోలు ఉమాపతి, కృష్ణారావు ఉన్నారు.

చీటీల పేరుతో మోసగించిన మహిళ నిలదీత

● ఐదు నెలల తర్వాత టెక్కలిలో ప్రత్యక్షం



సబితాదేవిని నిలదీస్తున్న బాధితులు

టెక్కలి: టెక్కలి రోటరీనగర్ ప్రాంతానికి చెందిన మాగాపు సబితాదేవి సుమారు 165 మంది నుంచి చీటీల పేరుతో వసూలుచేసి గతఏడాది నవంబరులో కనిపించకుండా పోయింది. మంగళవారం ఆమె ప్రత్యక్షమవడంతో బాధితులు నిలదీశారు. బాధితుల కథనం మేరకు.. ఈ వ్యవహారం అప్పట్లో సంచలనంగా మారడంతో పలువురు చీటీలు కట్టిన వారు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆమె కోసం కొన్నాళ్ల పాటు గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. కొన్నాళ్ల తర్వాత ఆమె 15 మందిపై ఐపీ పెడుతూ కోర్టును ఆశ్రయించింది. సబితాదేవి ఐదు నెలల తర్వాత మంగళవారం టెక్కలిలో ప్రత్యక్షమైంది. దీంతో పలువురు బాధితులు ఆమెను నిలదీశారు. చీటీల డబ్బు, అప్పు ఇచ్చిన నగదు చెల్లించాలని కోరారు. చీటీలు కట్టిన వారు, ఆమెకు అప్పులిచ్చి ప్రామిసరీ నోట్లు రాయించుకున్న వారు నిలదీసినా ఆమె నుంచి సమాధానం కరువైంది.

చికిత్స పొందుతూ మహిళ మృతి

పలాసరూరల్: పలాస మండలం సున్నాదేవి గ్రామానికి చెందిన రెయ్యిసావిత్రి (57) బైక్ ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. కాశీబుగ్గ ఏఎస్ఐ గణపతిరావు అందించిన వివరాలిలా ఉన్నాయి.. తన కుమారుడు హేమేశ్వర రావుతో కలిసి ద్విచక్ర వాహనంపై స్వగ్రామం వైపు వెళ్తుండగా సోమవారం మొగిలిపాడు వద్ద రోడ్డు ప్రమాదానికి గురైంది. వెంటనే ఆమెను 108లో పలాస ఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్సకు శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు తెలిపారు. దీనిపై ఏఎస్ఐ గణపతిరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సొంత నిర్ణయంతోనే టీడీపీలో చేరా: మన్మథరావు

పలాస: నా సొంత నిర్ణయంతోనే టీడీపీలో చేరానని పట్టణంలోని 23వ వార్డు వైసీపీ ఇన్‌చార్జి గూన మన్మథరావు తెలిపారు. గౌతు శిరీష గెలుపునకు తాను కృషి చేస్తానని అన్నారు. సోమవారం శిరీష ఆధ్వర్యంలో టీడీపీలో చేరానని, అయితే సాయంత్రం వైసీపీ నాయకుల ఇబ్బందులు పెట్టి, చేసిన ఒత్తిడితో మంత్రి అప్పలరాజు సమావేశానికి వెళ్లానని తెలిపారు. మంగళవారం ఆయన పలాస ఇన్‌చార్జి వై.వెంకన్న చౌదరి సమక్షంలో తిరిగి టీడీపీలో చేరారు. టీడీపీలో చేరిన తనను వైసీపీ నేతలు సుమారు 50 మంది వచ్చి బ్లాక్‌మెయిల్ చేసి, ఇబ్బందులకు గురిచేసి కారులో తీసుకువెళ్లి కండువా కప్పారని వివరించారు.

దాడులకు భయపడేదిలేదు: ప్రమీల

పొందూరు: వైసీపీ శ్రేణుల దాడులకు భయపడేది లేదని ఆమదాలవలస టీడీపీ అభ్యర్థి కూన రవికుమార్ సతీమణి, మాజీ ఎంపీపీ కూన ప్రమీల స్పష్టం చేశారు. మొదలవలస, బొడ్డేపల్లి గ్రామాల్లో మంగళవారం కూటమి అభ్యర్థుల తరపున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మజ్జిలపేటలో ఎన్నికల ప్రచారంలో తనపై వైసీపీ కార్యకర్త దాడి ఘటనపై ఆమె స్పందిస్తూ.. మండలంలో ఎప్పుడూ ఇటువంటి సంస్కృతి లేదని, వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాతే ఇటువంటి చర్యలు జరుగుతున్నాయన్నారు. ఓటమి భయంతోనే దాడులకు దిగుతున్నారని విమర్శించారు. దాడులకు భయపడేది లేదని మరింత ధైర్యంగా ముందుకు వెళతానని చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు ఎం.సీతారామారావు, ఎం.ధనలక్ష్మి, బి.సత్యం తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను ఆదరించండి

నందిగాం: కాంగ్రెస్ పార్టీని ఆదరించి అభ్యర్థులను గెలిపించాలని ఎంపీ అభ్యర్థి పేడాడ పరమేశ్వరరావు కోరారు. మంగళవారం పాలవలసపేట, నర్సిపురం, కొండ తెంబూరు తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఉపాధి పని ప్రదేశాలకు వెళ్లి ఓటర్లను అభ్యర్థించారు. ఉపాధి హామీ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వమే ప్రవేశ పెట్టిందని, రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపిస్తే కనీస వేతనం రోజుకి రూ.400 ఇస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి బి.గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో భద్రత పెంచండి: ఈసీఐ

పొందూరు: రాష్ట్రంలోని సమస్యాత్మక మండలాల్లో పొందూరు మండలం ఒకటని ఈ మండలంలోని అత్యంత సమస్యాత్మక గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో భద్రతను కట్టుదిట్టం చేయాలని ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా (ఈసీఐ)కి లోలుగు గ్రామానికి చెందిన టీడీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి లోలుగు వెంకట్ లేఖ రాశారు. ఈ లేఖపై స్పందించిన ఈసీఐ తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌ను ఆదేశిం చింది. ఈ ఆదేశాలను రాష్ట్ర ఎన్నికల కమిషన్ జిల్లా కలెక్టర్‌కు పంపి తగు చర్యలు చేపట్టాలని సూచించింది. ఈమేరకు ఈసీఐ నుంచి లేఖ వెంకట్‌కు లేఖ అందింది. భద్రతతో పాటు పోలింగ్‌కేంద్రాల వద్ద తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆ లేఖలో సూచించారు.

పవర్ లిఫ్టింగ్‌లో రాజశేఖర్ ప్రతిభ



పొందూరు: మండల కేంద్రానికి చెందిన గంటా రాజశేఖర్ పవర్ లిఫ్టింగ్ పోటీలో ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. శ్రీలంకలో ఈనెల 3 నుంచి 7 వరకు జరిగిన అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో 74 కేజీల జూనియర్స్ విభాగంలో బంగారు పతకం కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా ఆయనను కోచ్ దేగల రాముతోపాటు కుటుంబ సభ్యులు అభినందించారు.

50 మద్యం సీసాలు స్వాధీనం

వజ్రపుకొత్తూరు: పల్లిసారథిలో మంగళవారం అర్జి షణ్ముఖరావు వద్ద 50 మద్యం సీసాలను పట్టుకున్నట్లు పలాస ఎస్ఈబీ సీఐ ఎంఆర్వీ అప్పారావు చెప్పారు. షణ్ముఖరావు వద్ద మద్యం బాటిళ్లు కలిగి ఉన్నట్లు సమాచారం రావడంతో దాడులు చేయగా 50 బాటిళ్లతో పట్టుబడడంతో నిందుతుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ వీవీ గిరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

● **ఎచ్చెర్ల:** ఎస్ఎంపురంలో ఎం.సూర్యనారాయణ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 40 మద్యం బాటిళ్లను మంగళవారం ఎస్ఈబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. ఈ దాడుల్లో ఎస్ఈబీ సీఐ గోపాలకృష్ణ, ఎస్ఐలు కూర్మారావు, మాధవి తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు ఆవులు మృతి

ఎచ్చెర్ల: కుప్పిలి గ్రామంలో సోమవారం కురిసిన వర్షంతో పాటు పిడుగు పాటుకు మూడు ఆవులు మృతి చెందాయి. అలుపన సీతయ్య, లక్ష్మీనారాయణమ్మలకు చెందిన మూ డు ఆవులు పొలాల్లో రాత్రి వేళలో కట్టి ఉంచారు. దీంతో పిడుగుపాటుకు ఆరుబయట ఉన్న ఆవులు మృత్యువాతపడ్డాయి. సుమారు ఒక లక్ష నష్టం వాటిల్లిందని వారు ఆందోళన చెందుతున్నారు. ఈ మేరకు పశు వైద్యశాఖాధికారులకు సమాచారం అందించారు.

ముగిసిన గ్రామదేవత ఆలయ వార్షికోత్సవం

ముప్పిడి(పోలాకి): రాళ్లపాడు పంచాయతీ ముప్పిడి గ్రామదేవత ఆలయ 22వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, విశేష అలంకరణ, పండిత సత్కారం, అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఆలయ కమిటీ చైర్మన్ చిట్టి పావనీ సింహాచలం దంపతుల ఆధ్వర్యంలో గ్రామ మహిళలు ముగ్గురాటలతో అమ్మవారికి చల్లదనం చేశారు. రాత్రి బాల, బాలికల నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

82 సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ల గుర్తింపు

టెక్కలి: టెక్కలి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 315 పోలింగ్ కేంద్రాలకు గాను 82 సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు ఉన్నట్లు గుర్తించామని రిటర్నింగ్ అధికారి నూరుల్ కమర్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. క్రిటికల్ పోలింగ్ కేంద్రాల వద్ద ఒక్కో పోలింగ్ స్టేషన్‌కు ఆరుగురు చొప్పున, సాధారణ పోలింగ్ కేంద్రాలకు ఇద్దరు చొప్పున పోలీస్‌భద్రత ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పలు పోలింగ్ కేంద్రాల్లో స్ట్రైకింగ్ ఫోర్స్ ప్రత్యేక బందోబస్తు కల్పిస్తున్నామన్నారు. ఇంకొన్ని పోలింగ్ కేంద్రాలకు వీడియోగ్రాఫర్లు, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, వీఎస్‌టీ బృందాలు మోనటరింగ్ చేస్తుంటాయని తెలిపారు. ఈ ఎన్నికల్లో 2,300 మంది సిబ్బంది వినియోగించనున్నామని, 35 రూట్లు, 35 జోన్లు ఏర్పాటు చేశామన్నారు. వీటి పర్యవేక్షణకు అబ్జర్వర్లు కూడా ఉంటారన్నారు. పోలింగ్ సిబ్బం దిని తరలించేందుకు 33 బస్సులు, 32 మినీబస్సులు, 25 టాటా మ్యాజిక్ వ్యాన్‌లను వినియోగిస్తున్నామన్నారు. ఇప్పటికే ఈవీఎంల మాక్‌పోలింగ్, హోం ఓటింగ్ ప్రక్రియ పూర్తయ్యిందన్నారు. ఓటర్ల జాబితాలు సరిచూసుకోవడం, గల్లంతైన పేజీలను సమకూర్చడం చేపట్టామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదు పాయాలు ఉండేటట్లు సూచనలు చేశామన్నారు.

గ్రామాల్లో అవగాహన

గార: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని సీఐ ఎల్ఎస్‌నాయుడు అన్నారు. మంగళవారం ఆరంగిపేటలో ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పించారు. తగాదాలకు దూరంగా ఉండాలన్నారు. ఎస్ఐ కె.కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.